సాక్షి
బాపట్ల
సోమవారం । 1 । సెప్టెంబర్ । 2025



ఘనంగా శ్రీలక్ష్మీ గణపతి హోమం

నరసరావుపేటఈస్ట్: నరసరావుపేట టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద హెల్పింగ్ హ్యాండ్స్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో ఆదివారం శ్రీలక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,27,500 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 1,50,133 క్యూసెక్కులు వదులుతున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి రొంపిచర్ల మండలం బుచ్చిపాపన్నపాలేనికి చెందిన గానుగపెంట వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు రూ.1,00,116 విరాళంగా ఆదివారం అందజేశారు.

న్యూస్‌రీల్

రేపటి నుంచి నృసింహుని వార్షిక పవిత్రోత్సవాలు



మంగళగిరి టౌన్: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక పవిత్రోత్సవాలు సెప్టెంబర్ 2 నుంచి 5 వరకు నిర్వహించనున్నట్లు సహాయ కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి కె. సునీల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పవిత్రోత్సవాల్లో భాగంగా నాలుగు రోజుల పాటు స్వామికి విశేష పూజలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

పశ్చిమ డెల్టాకు 6,500 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి 6,500 క్యూసెక్కులు నీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కి 216, బ్యాంక్ కెనాల్ 1,486, తూర్పు కాలువకు 452, పశ్చిమ కాలువకు 208, నిజాపట్నం కాలువకు 413, కొమ్మూరు కాలువకు 2,380 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ నుంచి సముద్రంలోకి 2,33,975 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు



గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుంటూరు జిల్లాకు చెందిన గుత్తా శ్రీనివాసరావు ఎన్నికైనట్లు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.తిరుమలేష్, సత్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడలోని లయోలా కాలేజీలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘ సమావేశంలో భాగంగా జిల్లాకు చెందిన గుత్తా శ్రీనివాసరావు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. నిరంతరం ప్రధానోపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించే వ్యక్తి అని తెలిపారు. శ్రీనివాసరావుకు పలువురు ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు విజయ భాస్కర్, ఎండీ ఖాసీం అభినందనలు తెలియజేశారు.



కొల్లూరు స్నానాల రేవు వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి ఊరేగింపులో భక్తులు

వెళ్లి రావయ్యా.. బొజ్జ గణపయ్యా..



చినపరిమి గ్రామంలో విఘ్నాధిపతి ఊరేగింపులో భక్తులు



కొల్లూరులో సిద్ధిబుద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటైన గణపతి ఊరేగింపు

జై బోలో గణపతి మహారాజ్ కీ.. జై... అంటూ వినాయక విగ్రహాల నిమజ్జన ఊరేగింపులు ఆదివారం కోలాహలంగా సాగాయి. ఐదవ రోజు కావడంతో వాడవాడలా ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు, భక్తి గీతాలాపనలు, సాంస్కృతిక వేడుకలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా వాహనాలపై అలంకరించిన గణనాథులను మేళతాళాలతో ఊరేగింపుగా నిమజ్జనానికి భక్తులు తరలించారు.

–సాక్షి నెట్‌వర్క్

పుష్టిగా పశు సంపద సృష్టి!

సరోగసి (అద్దె గర్భం) విధానం మనుషుల్లోనేకాక పశువులలో కూడా అభివృద్ధి చేయడం ద్వారా వ్యవసాయ రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఒంగోలు జాతి గిత్తలను సరోగసి విధానంతో ఉత్పత్తి పెంచడం ద్వారా వ్యవసాయ పరంగానే కాకుండా పాల ఉత్పత్తి, పశువుల ఎగుమతి ద్వారా వాణిజ్య పరంగా కూడా అభివృద్ధి సాధ్యపడనుందని శాస్త్రవేత్తలు, వైద్యులు చెబుతున్నారు.

- సరోగసి విధానంలో మేలుజాతి ఒంగోలు గిత్తల అభివృద్ధికి పెరిగిన అవకాశాలు
- ఐవీఎఫ్ పద్ధతిలో కోరుకున్న దూడల సృష్టి
- తొలిసారి బొల్లాపల్లి గ్రామంలో నరసింహ అనే ఒంగోలు జాతి కోడెదూడ రెండేళ్ల క్రితం జననం
- వ్యవసాయ రంగంలో వినూత్న ఒరవడితో ఎన్నో ప్రయోజనాలు



సరోగసి విధానంలో ఆవు గర్భంలోకి పిండాన్ని ప్రవేశపెడుతున్న దృశ్యం

మార్టూరు: బాపట్ల జిల్లా మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామంలో సరోగసి విధానంతో జన్మించిన ఒంగోలు జాతి గిత్త నరసింహతో జిల్లాలో పశువులలో సరోగసి విధానాన్ని మొదటిసారిగా దాదాపు రెండేళ్ల క్రితం ప్రారంభించారు.

జన్యు సంరక్షణ

పశువులలో సరోగసి విధానం ద్వారా మేలైన పశుసంపద సృష్టించడానికి ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ, తిరుపతిలోని వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం సంయుక్త కార్యాచరణ రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ప్రకాశం జిల్లా దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ లీలాకృష్ణ, చదలవాడ పశు ఉత్పత్తి కేంద్రం ఏడీఏ డాక్టర్ బీ రవి, డాక్టర్ సోమశేఖర్‌తోపాటు మార్టూరు ఏడీఏ పద్మావతి, మార్టూరు మండలం కోలలపూడి పశు వైద్యురాలు మాధవీలతల బృందం కృషి ఎంతో ఉంది.

మేలు జాతి కోసం

సాధారణంగా ఒక ఆవు తన జీవితకాలంలో 8 నుంచి 10 దూడలను ఈనగలదు. మేలు జాతి ఆవు నుంచి సేకరించిన అండాలతో ఫలదీకరించిన 150 పిండాల ద్వారా సరోగసి విధానంలో 50 నుంచి 60 వరకు మేలు జాతి దూడలను పొందవచ్చు. ఈ పద్ధతి ద్వారా వయసు మీరిన, గాయపడిన, సహజ పద్ధతిలో సంతానోత్పత్తి చేయలేని ఆవుల నుంచి సైతం పిండాలను అభివృద్ధి చేయటం ద్వారా దూడలను పొందవచ్చు. ఈ విధానానికి సహజంగా తక్కువ పాల దిగుబడి ఉన్న ఆవుల గర్భాలను వైద్యులు ఎంచుకుంటారు. పాల దిగుబడి ఎక్కువగా ఇచ్చే మేలు రకపు ఆవుల నుంచి సేకరించిన అండాలతో మరో మేలు జాతి కోడెదూడల వీర్యంతో ఫలదీకరణ చేయబడిన పిండాలను ఈ ఎంపిక చేయబడిన ఆవుల గర్భంలో ప్రవేశపెడతారు. తద్వారా మేలురకపు పశు సంపద ఉత్పత్తి జరుగుతుంది. సరోగసి విధానం వలన అంతరించి పోతున్న పుంగనూరు, ఒంగోలు జాతి గిత్తలను గణనీయంగా ఉత్పత్తి చేసుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. గతంలో బ్రెజిల్‌కు ఎగుమతి చేయబడిన ఒంగోలు జాతి గిత్త మూలాలు కలిగిన కోడె దూడ ఇటీవల అదే దేశంలో అక్షరాల రూ.41 కోట్ల ధర పలికిన విషయం తెలిసిందే.

ప్రయోజనాలు ఎన్నో..

సరోగసి విధానం ద్వారా అధిక పాల ఉత్పత్తిని ఇచ్చే సామర్థ్యం గల ఆవులను సృష్టించవచ్చు. తద్వారా గణనీయమైన పాల ఉత్పత్తిని సాధించటంతోపాటు ఎగుమతులు చేయవచ్చు. మేలు జాతి కోడెదూడలను ఉత్పత్తి చేయడం ద్వారా వ్యవసాయంలో వినియోగించుకునే అవకాశం ఉంది. ఒంగోలు జాతి కోడె దూడల వీర్యానికి ప్రపంచస్థాయిలో ఉన్న డిమాండ్, పేరు ప్రఖ్యాతులు దృష్ట్యా ఇతర దేశాలకు ఎగుమతులు సైతం చేసుకొనే వాణిజ్యపరమైన అవకాశాలు లేకపోలేదు. ప్రస్తుతం విస్తరిస్తున్న ప్రకృతి సేద్యంలో భాగంగా గో వ్యర్థాలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. తదద్వారా ఆరోగ్యకరమైన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పెంపకాలకు ఎంతో అవకాశం ఉంది.

అలా 'నరసింహ'కు ఊపిరి పోసి...



సరోగసి విధానం ద్వారా జన్మించిన బొల్లాపల్లిలోని కోడెదూడ నరసింహ

వీరి ప్రయత్నంతోనే మండలంలోని బొల్లాపల్లి గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం గోశాలలోని ఆవు గర్భంలో ఫలదీకరించబడిన వేరే ఆవు పిండాన్ని ప్రవేశపెట్టడం ద్వారా 'నరసింహ' అనే ఒంగోలు జాతి కోడెదూడ 2023 సెప్టెంబర్ 12వ తేదీన పుట్టింది. వాస్తవానికి ఈ కోడె దూడ తాలూకు జన్యుపరమైన తల్లి ఆవు వయోభారంతో 2022 జూన్ నెలలోనే మరణించింది. అప్పటికే అంటే 2022 ఏప్రిల్ నెలలోనే ఈ ఆవు నుంచి సేకరించిన అండాల నుంచి అభివృద్ధి చేసిన పిండాన్ని అతి శీతలీకరణ పద్ధతిలో ద్రవ నత్రజనిలో భద్రపరిచారు. తల్లి మరణించిన సంవత్సరం తర్వాత కూడా అద్దె గర్భం ద్వారా పుట్టిన దూడగా నరసింహ రికార్డు సృష్టించటం గమనార్హం.

సరోగసి ద్వారా 20కుపైగా దూడలు



ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సరోగసి విధానం ద్వారా ఇప్పటివరకు సుమారు 20 దూడలను ఉత్పత్తి చేశాం. ప్రస్తుతం ప్రతి మండలంలో శిక్షణ పొందిన సిబ్బంది ద్వారా ఒంగోలు జాతి గిత్తల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. స్థానికంగా కూలీల రేట్లు పెరిగి పశుపోషణ భారంగా మారుతున్నందున రైతులు వ్యవసాయం కోసం పశువులపై కంటే యంత్రాలవైపే మొగ్గు చూపుతున్నారు.

– డాక్టర్ సోమశేఖర్, పశువైద్యుడు, కొణిజేడు, టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా

పశు ఉత్పత్తి పెంపుతో ప్రయోజనాలు

సరోగసి విధానం ద్వారా మేలు జాతి పశు ఉత్పత్తి పెరగడం వల్ల పాల దిగుబడి అధికం కానుంది. రైతులకు ఆదాయం చేకూరుతుంది. పంటల గిట్టుబాటు ధరలు ఒడిదొడుకులను ఎదుర్కొంటున్న వేళ పాల ఉత్పత్తి ద్వారా రైతులు నికరాదాయాన్ని పొందగలుగుతారు. ప్రకృతి సేద్యంలో నేడు వినియోగిస్తున్న అన్ని రకాల కషాయాల తయారీకి గో ఆధారిత వ్యర్థాలనే వినియోగిస్తున్నారు. ఆరోగ్యకరమైన పంటలను పండించగలుగుతున్నారు.

– వీరవల్లి కృష్ణమూర్తి, మార్టూరు మండల రైతు సంఘం అధ్యక్షుడు

ముగిసిన క్యారమ్ పోటీలు

ఆంధ్ర స్టేట్ క్యారమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ





ప్రథమ బహుమతి అందుకుంటున్న సీహెచ్ జనార్దనరెడ్డి, ఎ.భవాని

చిలకలూరిపేట: ఏపీ స్టేట్ క్యారమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టేట్ ర్యాంకింగ్ క్యారమ్ పోటీలు సీఆర్ క్లబ్‌లో రెండో రోజైన ఆదివారం ముగిశాయి. పురుషులు, మహిళల విభాగంలో విడివిడిగా నిర్వహించిన ఈ పోటీలలో రాష్ట్ర నలుమూలల నుంచి 150 మంది పురుషులు, 20 మంది మహిళలు పాల్గొన్నారు. పురుషుల విభాగంలో తొలి నాలుగు స్థానాల్లో సీహెచ్ జనార్దనరెడ్డి (విశాఖపట్నం), ఎన్.వెంకయ్య (నెల్లూరు), బి.జయకుమార్(గుంటూరు), బి.పవన్‌కుమార్ (అనంతపురం) నిలిచారు. మహిళల విభాగంలో ఎ.భవాని, ఎల్.హరిప్రియ, ఎంఎస్‌కే హారిక, ఎస్‌కే హుస్నా సమీర బహుమతులు సాధించారు. ఈ నలుగురు విశాఖపట్నం వారే కావడం విశేషం. సీహెచ్ జనార్దనరెడ్డి ఏడో ప్రపంచ కప్ క్యారమ్ పోటీలలో పాలొనేందుకు సీఆర్ క్లబ్ తరఫున రూ.లక్ష సహాయం అందించారు. ఏపీ స్టేట్ క్యారమ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీలకు చీఫ్ రిఫరీగా డాక్టర్ షేక్ సాజిదా, అసిస్టెంట్ చీఫ్ రిఫరీగా ఎండీ సిరాజ్ బాషా వ్యవహరించారు. కార్యక్రమంలో సీఆర్ క్లబ్ అధ్యక్షుడు చెరుకూరి కాంతయ్య, కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, కోశాధికారి ఎం.నరసింహారావు, క్లబ్ కల్చరల్ ఇన్‌చార్జి గోరంట్ల నారాయణ, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్వీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా ఉంటాం

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులకు ఏపీ ఎన్జీఓ సంఘం అండగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ తెలిపారు. కమర్షియల్ ట్యాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ స్టేట్ జనరల్ బాడీ మీటింగ్ విజయవాడలోని సంఘ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు భవనారి వెంకటేష్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. 15 డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



విజేతగా నిలిచిన విజయనగరం జట్టుతో నిర్వాహకులు

- లయోలా ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి
- ముగిసిన అంతర్రాష్ట్ర మహిళల సాఫ్ట్‌బాల్ పోటీలు

సత్తెనపల్లి: విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని లయోలా ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళ్ళిపాళ్ల సమీపంలోని లయోలా ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న 12వ అంతర్ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రమం తప్పని సాధన ముందుకు తీసుకు వెళుతుందన్నారు. రిటైర్డ్ పీడీ దాసరి కోటేశ్వరరావు, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర కన్వీనర్ ఎంవీ రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.నరసింహారెడ్డి, గుంటూరు జిల్లా సెక్రెటరీ పి. సామంతరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ తిరుపతి, ట్రెజరర్ జనార్దన్ యాదవ్, లయోలా ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. అనంతరం విజేతలను అభినందించి, బహుమతులు అందించారు.



రెండవ స్థానంలో నిలిచిన గుంటూరు జట్టుతో నిర్వాహకులు

హోరాహోరీగా పోటీలు...

సెమీఫైనల్స్‌లో వైఎస్సార్ కడప, గుంటూరు జట్లు తలపడ్డాయి. 0–5తో గుంటూరు విజయం సాధించింది. విజయనగరం, కృష్ణా జట్లు పోటీ పడగా, 11–2తో విజయనగరం విజేతగా నిలిచింది. ప్రీ ఫైనల్స్‌లో గుంటూరు, విజయనగరం తలపడ్డాయి. గుంటూరు 3–2తో గెలిచింది. వైఎస్సార్ కడప, కృష్ణా జట్లు తలపడిన పోటీలో 4–2తో వైఎస్సార్ కడప జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్స్‌లో విజయనగరం, వైఎస్సార్ కడప జట్లు తలపడ్డాయి. 8–2తో విజయనగరం విజయం సాధించింది. గ్రాండ్ ఫైనల్‌లో గుంటూరుపై విజయనగరం 5–4తో గెలిచింది. చాంపియన్‌గా విజయనగరం, రన్నర్స్‌గా గుంటూరు, తృతీయ స్థానం వైఎస్సార్ కడప, నాలుగవ స్థానం కృష్ణా జిల్లా జట్టు కైవసం చేసుకున్నాయి.

దారుణ పాశం..!

అప్పు సులభంగా ఇస్తున్నారని యాప్‌లతో మోసపోతున్న యువత

- లోన్ యాప్‌ల మాయలో కూరుకుపోతున్న యువకులు
- ఆర్థిక అవసరాల కోసం పెద్ద మొత్తంలో అప్పులు
- అధిక వడ్డీ చెల్లించకుంటే బాధితులకు తీవ్ర వేధింపులు
- ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న రుణగ్రహీతలు



జె.పంగులూరు: అవసరాలు కావచ్చు.. జల్సాలు చేయడానికి కావచ్చు.. కారణమేదైనా లోన్ యాప్‌ల ట్రాప్‌లో పడుతున్న యువత జీవితాలను నాశనం చేసుకుంటోంది. ఎలాంటి దస్తావేజులతో పనిలేదు... ప్రాంశరీ నోట్లపై సంతకాలు కూడా అవసరం లేదు... యాప్ డౌన్‌లోడ్ చేసుకొని అందులో వివరాలు నమోదు చేస్తే చాలు... చిటికెలో అప్పు చేతికి అందుతోంది. నగదు అత్యవసరమైన వారికి ఇది చాలా తేలిక. కొందరు గూగుల్ పే, ఫోన్ పేల్లో వచ్చిన ప్రకటనలు చూసి, ప్లేస్టోర్‌లో ఆన్‌లైన్ మనీ యాప్‌లను గాలించి డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. వారు అడిగిన అనుమతులన్నీ ఇచ్చేస్తున్నారు. గుర్తింపు, చిరునామాల కోసం ఆధార్ కార్డు, పాన్ కార్డుల వివరాలు అప్‌లోడ్ చేస్తున్నారు. అనంతరం లోన్ యాప్ నిర్వాహకుల ట్రాప్‌లో చిక్కుకుని విలవిల్లాడిపోతున్నారు.

సిబిల్ స్కోర్ కోసం...

అత్యవసరం నిమిత్తం కొంతమంది ఆన్‌లైన్ మనీ యాప్‌లు వినియోగిస్తున్నారు. మరికొంత మంది సిబిల్ స్కోర్‌ను పెంచుకోవడాలని యాప్‌ల ద్వారా రుణాలు తీసుకుంటున్నారు. బ్యాంక్‌లు క్రెడిట్ కార్డులు ఇవ్వాలన్నా, ఏదైనా వస్తువును ఈఎంఐ పద్ధతిపై కొనాలన్నా సిబిల్ స్కోర్ తప్పనిసరి. చివరికి బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలన్నా ఇదే ఆధారం. ఈ స్కోర్ తక్కువగా ఉన్న వారందరూ ఈ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకుంటున్నారు. సాధారణంగా సిబిల్ స్కోర్ ప్రతి ఆరు నెలలకోసారి అప్‌డేట్ అవుతుంది. ఆన్‌లైన్ మనీ యాప్‌ల ద్వారా అప్పులు తీసుకుంటే తక్కువ రోజుల్లోనే తిరిగి చెల్లించాలి. అంతా అనుకున్నట్లు జరిగితే సిబిల్ స్కోర్ పెరుగుతుంది. తక్కువ మొత్తంలో అప్పు తీసుకొని సిబిల్ స్కోర్‌ను పెంచుకుందామనే ఆలోచనలో చాలా మంది యాప్‌ల మాయలో చిక్కుతున్నారు. తద్వారా సిబిల్ స్కోర్ పెంచుకోలేక, తీసుకున్న అప్పు తీర్చలేక నానా ఇబ్బందులు పడుతున్నారు.

విలాసాల కోసం ట్రాప్‌లో విద్యార్థులు

డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు విలాసాలకు అలవాటు పడుతున్నారు. పార్టీలు, ఎంజాయ్‌మెంట్లకు ఆర్థిక అవసరాలు పెరుగుతున్నాయి. ఇళ్లలో తల్లిదండ్రులు ఇచ్చే డబ్బులు ఈ అవసరాలను తీర్చలేకపోతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి యువకుడి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉండటంతో అవసరమైనప్పుడల్లా డబ్బులు యాప్‌ల ద్వారా అప్పుగా తీసుకుంటున్నారు. ఇలా తీసుకున్న డబ్బుతో అవసరాలను తీర్చుకుంటున్నారు. యాప్‌లలో రుణాలు అసలు, వారు వేసే అధిక వడ్డీ చెల్లించలేకపోతున్నారు.

తీవ్ర వేధింపులు

యాప్‌ల నిర్వాహకులు విధించే వడ్డీ అడ్డూఅదుపు లేకుండా పోతోంది. రూ. 7 వేలు తీసుకున్న బాధితుడిని పది రోజుల్లోనే రూ. 12 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అసలు కన్నా వడ్డీ దాదాపుగా రెట్టింపు వసూలు చేశారు. వాస్తవానికి జాతీయ బ్యాంకులు సిబిల్ స్కోర్‌ను బట్టి వడ్డీలు ఉంటాయి. పక్కాగా ఈఎంఐలు చెల్లిస్తే ఎలాంటి ఇబ్బంది కూడా ఉండదు. వాటిని కాదని ఒక్కసారి ఈ యాప్‌ల వలలో చిక్కితే తీవ్ర ఇబ్బందులు తప్పవు.

మార్ఫింగ్ చిత్రాలతో బెదిరింపులు

లోన్ మంజూరు చేసే సమయంలో యాప్‌లో నమోదు ప్రారంభించగానే ఫోన్‌లోని సమాచారం అంటే కాంటాక్ట్ లిస్ట్, ఫొటోలు వంటి వాటిపై నిర్వాహకులకు పర్మిషన్ లభిస్తుంది. వారడిగినట్లుగా డబ్బు చెల్లించకపోతే మొదట బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి ఫలానా వ్యక్తి లోన్ చెల్లించడం లేదని చెబుతారు. రెండోసారి... లోన్ తీసుకున్న వ్యక్తి ఫొటోలను మార్ఫింగ్ చేస్తామని బెదిరిస్తారు. సెల్‌ఫోన్‌లో ఉన్న మహిళల ఫోను నెంబర్లకు అశ్లీల చిత్రాలను పంపిస్తామని హెచ్చరిస్తుంటారు. అసలు తీసుకున్న లోన్‌తో సంబంధం లేకుండా వాళ్లడిగినంత ఇచ్చినప్పటికీ ఇంకా కావాలని వేధిస్తారు. ఫోన్ అంటుకోవాలంటే భయపడేలా మాటల దాడిని పెంచుతారు. చివరకు జీవితంపై విరక్తి వచ్చేలా చేస్తారు. ఒక్క సారి ఈ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకొని అన్ని వివరాలు ఇచ్చారంటే వారి వలలో చిక్కినట్టే.

స్వీయ జాగ్రత్తలే రక్ష



ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్ ఫోన్‌లో అనవసరమైన లింక్‌లపై క్లిక్ చేసి మోస పోవద్దు. ప్రస్తుత యువత ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి అవసరాల కోసం లోన్ యాప్‌లను ఆశ్రయిస్తున్నారు. ఎంతటి ఆర్థిక అవసరమైనా యాప్‌ల ద్వారా లోన్ తీసుకోకూడదు. తల్లిదండ్రులకు తెలియకుండా యాప్‌లను ఆశ్రయిస్తున్న యువత ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఒక వేళ లోన్ యాప్‌లో ఇప్పటికే తీసుకున్న బాధితులుంటే 1930 సహాయక నంబరుకు ఫిర్యాదు చేయాలి. వారి సూచనలతో సంబంధిత పోలీసులను సంప్రదించాలి.

– వినోద్‌బాబు, ఎస్సై, రేణింగవరం

క్లుప్తంగా

యథావిధిగా పింఛన్ల పంపిణీ

నెహ్రూనగర్: సెర్ప్ సీఈఓ ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీ గత నెలలో చేసిన విధంగానే ఈ నెలలోనూ అర్హులైన లబ్ధిదారులందరికీ పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.15,000, రూ.10,000, రూ.6,000, రూ.4,000 కేటగిరిల పింఛన్ యథావిధిగానే చేస్తారని తెలిపారు.

మనిషికి ఆధ్యాత్మిక చింతన అవసరం

ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ నగేష్‌బాబు



మంగళగిరి టౌన్: ప్రస్తుత ఒత్తిళ్లతో కూడుకున్న జీవితాలలో ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ కమాండెంట్ నగేష్‌బాబు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో వినాయక చవితి మహోత్సవాల్లో ఆదివారం ఆయన పాల్గొన్నారు. గణపతి భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాల గణపతి విగ్రహం వద్ద లడ్డూలు, స్వామివారి కరెన్సీ నోట్ల దండలకు బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నగేష్‌బాబు మాట్లాడుతూ వినాయక చవితి వంటి ఉత్సవాలు ప్రజల్లో ఐకమత్యానికి దోహద పడతాయని, ప్రతి ఒక్కరూ దైవ భక్తి కలిగి సమాజ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఏ మతమైనా అందరూ బాగుండాలని, ఇతరులకు హాని కలిగించరాదని అన్నారు. అనంతరం భక్త బృంద ప్రతినిధులు కృష్ణారావు, అయ్యప్పరెడ్డి, చిన్న వెంకటేశ్వర్లు కమాండెంట్ నగేష్‌బాబును ఘనంగా సత్కరించారు.

అందరి ఆరోగ్యం మన బాధ్యత



డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టరు విజయమ్మను సన్మానిస్తున్న ఏఎన్‌ఎంలు

బాపట్ల: జిల్లాలోని ప్రజలందరి ఆరోగ్యం మన బాధ్యతగా తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టరు విజయమ్మ పేర్కొన్నారు. గ్రేడ్ 3 నుంచి గ్రేడ్ 2గా పదోన్నతులు కల్పించేందుకు కృషి చేసిన జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ విజయమ్మను ఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. డాక్టర్ విజయమ్మ మాట్లాడుతూ జిల్లా ప్రతి ఒక్కరికి మెరుగైన ఆరోగ్యం అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని గుర్తు చేశారు. కష్టపడి పని చేసేవారికి ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి.నాగేశ్వరరావు, ఏఎన్‌ఎంలు, ఎన్జీవో నాయకులు పాల్గొన్నారు.

పోలీస్‌గా ఉద్యోగంలో చేరడం అదృష్టం

జిల్లా ఎస్పీ తుషార్ దూడీ



ఉద్యోగ విరమణ చేసిన పోలీసులను సన్మానిస్తున్న ఎస్పీ తుషార్‌దూడీ

బాపట్లటౌన్: పోలీస్‌శాఖలో 30 సంవత్సరాలకు పైగా సుదీర్ఘ సేవలు అందించడం హర్షనీయమని జిల్లా ఎస్పీ తుషార్ దూడీ అన్నారు. జిల్లా పోలీస్ విభాగంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన పీజీఆర్‌ఎస్ సెల్ ఎస్ఐ డి.వి. డేవిడ్, స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ ఎన్.రామకోటేశ్వరరావులను ఆదివారం సన్మానించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం చాలా ఒత్తిడితో కూడుకున్నదన్నారు. ప్రజలకు నేరుగా సేవలు అందించడం పోలీసు ఉద్యోగంలోనే జరుగుతుందన్నారు. అలాంటి ఉద్యోగంలో మనం చేరడం చాలా గొప్ప అదృష్టంగా భావించాలన్నారు. పోలీస్ శాఖకు సుదీర్ఘకాలం పాటు విశేషసేవలు అందించడం ఎంతో గొప్ప విషయమన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆహ్లాదకరంగా గడపాలని, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఎటువంటి సమస్య వచ్చిన నేరుగా తమను కలవవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి, వెల్ఫేర్ ఆర్ఐ మౌలిద్దీన్, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనం వేడుకల్లో నిబంధనలు తప్పనిసరి

జిల్లా అడిషనల్ ఎస్పీ సంతోష్



పోట్లూరు గ్రామంలో పర్యటించిన జిల్లా అడిషనల్ ఎస్పీ సంతోష్

శావల్యాపురం: వినాయక విగ్రహాల నిమజ్జనం వేడుకల్లో పోలీసు నిబంధనలు అందరూ పాటించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ జి.సంతోష్ అన్నారు. ఆదివారం మండలంలోని పొట్లూరు, వేల్పూరు గ్రామాల్లో జరుగుతున్న వినాయక విగ్రహాల నిమజ్జనం వేడుకలు సందర్భంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వినుకొండ నియోజకవర్గంలో శావల్యాపురం, బొల్లాపల్లి, నూజెండ్ల మండలాల్లో పలు గ్రామాల్లో పర్యటించామన్నారు. వినాయక విగ్రహాలు నిమజ్జనం సమయంలో శాంతిభద్రతలు విఘాతం కల్గకుండా ఉండటానికి ముందస్తులో భాగంగా పర్యవేక్షణ చేస్తున్నట్లు వెల్లడించారు. సమస్యాత్మక గ్రామాలుగా ఉండే వాటిపై ప్రత్యేకంగా పోలీసు నిఘా ఉంచామన్నారు. ఐదో రోజు నరసరావుపేట డివిజన్ 397 విగ్రహాలు నిమజ్జనం జరుగుతున్నాయన్నారు. ఈ క్రమంలో అల్లర్లు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామని నిబంధనలు అతిక్రమిస్తే అటువంటి వారిపై కమిటీ సభ్యులను బాధ్యులను చేస్తూ కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని విగ్రహాలు నిమజ్జనం చేసే ఏరియాను పరిశీలించి పోలీసు అధికారులకు సూచనలు చేశారు. ఆయనతోపాటు సీఐ గోపి, ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు, ఎస్‌బి కానిస్టేబుల్ రమేష్, స్టేషన్ రైటరు బాషా పాల్గొన్నారు.

బీసీలపై వివక్ష చూపుతున్న కూటమి ప్రభుత్వం

బీసీలపై వివక్ష చూపుతున్న కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న కుమ్మర క్రాంతికుమార్

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలపై వివక్ష చూపుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో బీసీలంతా కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచారన్నారు. బీసీలకు ఇస్తామన్నా హామీలను నెరవేర్చడానికి చిత్తశుద్ధి లేదన్నారు. బీసీలపై కపట ప్రేమ చూపిస్తూ వారిని మభ్య పెట్టాలని చూస్తుందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో బీసీలపై అనేక దాడులు జరిగాయన్నారు. వీటిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏడాదిన్నర పాలనలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి నిధులు ఇచ్చిన పాపాన పోలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో చెప్పిన బీసీల రక్షణ చట్టం తెస్తామన్నారు..దానిని గాల్లో పెట్టారన్నారు. కులగణన చేస్తామన్నారు..దానికి అతిగతి లేదన్నారు. తక్షణమే కుల గణన చేపట్టి, బీసీల రక్షణ చట్టాన్ని అమల్లోకి తీసుకురావాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాలు ముట్టడి, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు, గుంటూరు యువజన అధ్యక్షులు తురక రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోలా మణికంఠ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టి యువకుడి మృతి

తెనాలి రూరల్: డివైడర్‌ను ఢీకొట్టి యువకుడు మృతి చెందిన ఘటన శనివారం అర్ధరాత్రి దాటాక తెనాలిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మారిస్‌పేట నిజాంపట్నం కాల్వ కట్టపై నివసించే అన్నపురెడ్డి పవన్(21) బైక్‌పై వెళుతూ కొత్త వంతెన వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

కర్లపాలెం: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై ఓ రైతు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల మేరకు... కాకుమానుకు చెందిన దొప్పలపూడి చంద్రపాల్(61) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం వరినారు కోసం ద్విచక్ర వాహనంపై బాపట్ల మీదుగా కర్లపాలెం వస్తున్నాడు. కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం సమీపంలో వెనుక నుంచి వచ్చిన ట్రక్ ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో చంద్రపాల్ తీవ్రంగా గాయపడటంతో అతనిని మొదటిగా బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో చంద్రపాల్ మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని కుమారుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రవీందర్ తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని చిరు వ్యాపారి మృతి



వెంకట నరసయ్య (ఫైల్)

కొల్లూరు : వేగంగా దూసుకొచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ చిరు వ్యాపారి తీవ్రంగా గాయపడి ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మండలంలోని బొద్దులూరుపాడుకు చెందిన కొల్లూరు వెంకట నరసయ్య (68) గ్రామంలో కిరాణా షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం కొల్లూరులో సామగ్రిని కొనుగోలు చేసుకొని, మోపెడ్‌పై గాంధీనగర్‌లో నివసిస్తున్న కుమార్తెను చూసేందుకు వెళుతున్నారు. ఈ సమయంలో తెనాలి వైపు నుంచి అతి వేగంగా దూసుకొచ్చిన ఓ ద్విచక్ర వాహనదారుడు నరసయ్య వాహనాన్ని ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన్ను కుమార్తె 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించింది. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి నరసయ్య మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన నివేదిక మేరకు కొల్లూరు పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ జానకీ అమర వర్ధన్ తెలిపారు.

సరిహద్దు రాళ్ల ట్రాక్టర్ బోల్తా



కారంచేడు: మార్టూరు నుంచి చీరాలకు సరిహద్దు రాళ్ల లోడుతో వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ నష్టం జరగలేదు. ఆదివారం వాడరేవు–పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో.. కారంచేడు అంబేడ్కర్ నగర్ కాలనీ సమీపంలో ఈ ఘటన జరిగింది. ట్రాక్టర్ ట్రక్కు వెనుక టైర్లకు బేరింగ్‌లు ఊడిపోవడంతో ఒక్క సారిగా తిరగబడింది. ఆ సమయంలో ఇతర వాహనాలు అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ట్రాక్టర్ కూడా నిదానంగా ప్రయాణిస్తుండటంతో కేవలం ట్రక్కు మాత్రమే బోల్తా పడింది. దీంతో రాళ్లు ప్రధాన రహదారిలో పడటంతో వాహన ప్రయాణాలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. స్థానిక ఏఎస్ఐ శేషసాయి సిబ్బందితో అక్కడకు చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

విద్యుదాఘాతంతో బిహార్ కూలీ మృతి

తెనాలి రూరల్: విద్యుదాఘాతంతో బిహార్‌కు చెందిన కూలీ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బిహార్‌కు చెందిన ఓం ప్రకాష్(41) నాలుగేళ్లుగా మండలంలోని ఖాజీపేటలోని ప్లాస్టిక్ రీసైక్లింగ్ కంపెనీలో పని చేస్తున్నాడు. శనివారం సాయంత్రం కంపెనీలోని డ్రయ్యర్‌ను శుభ్రం చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై వెనక్కు పడడంతో తలకు తీవ్ర గాయమైంది. తెనాలిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దోపిడీదారులకు కొమ్ము కాస్తున్న ప్రభుత్వాలు



మాట్లాడుతున్న కొండారెడ్డి

అద్దంకి: శ్రమశక్తిని దోచుకుని సంపాదన పెంచుకునే దోపిడీదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొమ్ము కాస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండారెడ్డి అన్నారు. కర్షక ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన తరుణం ఆసన్నమైందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆదివారం అద్దంకిలోని సుందరయ్య భవన్‌లో నియోజకవర్గ స్థాయి సీపీఎం కార్యకర్తల ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 'వర్తమాన రాజకీయాలు' అనే అంశంపై చర్చించారు. కొండారెడ్డి మాట్లాడుతూ శ్రమ శక్తి ద్వారా సంపదను శ్రమజీవులు సృష్టిస్తే, అది కొంతమంది వ్యక్తులు చేతుల్లోకి వెళుతోందని, ఆ సంపదను వాళ్లు పెట్టుబడిగా పెట్టి దాన్ని మరింతగా పెంచుకుంటున్నారన్నారు. శ్రమచేసి సంపాదన సృష్టించిన శ్రమజీవులకు పంచాలన్నదే మార్క్సిస్ట్ పార్టీ లక్ష్యం అని చెప్పారు. ఇటీవల నిర్వహించిన పార్టీ మహాసభ రాజకీయ తీర్మానం కూడా అదే అని కొండారెడ్డి పేర్కొన్నారు. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ 300 కోట్ల జనాభా పరిధిలో ఉంటే, సోషలిస్ట్ ఆర్థిక వ్యవస్థ 150 కోట్ల జనాభా పరిధిలో ఉందని అన్నారు. ప్రస్తుతం పెట్టుబడి దారి ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. పోరాటాలు జరిగిన చోట కొన్ని దేశాల్లో కమ్యూనిస్టులను అధికారంలో తీసుకొస్తున్నారని, పోరాటాలు జరగని దేశాల్లో మితవాదులు ముందుకొస్తున్నారని కొండారెడ్డి చెప్పారు. ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేసి సంపదను ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్నాయని, ఆశ్రిత పెట్టుబడి విధానం అమలు జరుగుతోందని చెప్పారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వేలాది ఎకరాలను కార్పొరేట్ సంస్థలకు అప్పచెబుతున్నారని, ఒక్క పరిశ్రమ కూడా జిల్లాకు రాలేదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక, విద్యార్థి, రైతు, మహిళ, మేధావి వర్గం అంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రతి గ్రామంలోనూ ప్రజలను కూడగట్టాలని, వాటి వల్ల కలిగే నష్టాలను వివరించాలని తెలిపారు. జిల్లా నాయకులు ఎం. ఆంజనేయులు అధ్యక్షత వహించారు. అద్దంకి టౌన్ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు వందన సమర్పణ చేశారు.

రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తున్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్

గుంటూరు మెడికల్: మొదటి నుంచి రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాలు సామాజిక న్యాయాన్ని చిన్నచూపు చూస్తూ తమ అనుంగ మిత్రుల లాభార్జనకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రతన్‌లాల్ తెలిపారు. స్థానిక బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో ఆదివారం బి.పి. మండల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అధ్యక్షతన 'భారత రాజ్యాంగం, సామాజిక న్యాయం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ప్రొఫెసర్ రతన్‌లాల్ మాట్లాడుతూ రాజ్యాంగంలో చెప్పిన సామ్యవాద, లౌకిక వాద ఆలోచనలను వ్యతిరేకిస్తూ, దాని స్థానంలో మను ధర్మ శాస్త్రం ఉండాలని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. దళిత బహుజనులను అభివృద్ధిలో భాగం చేసిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత నేడు బహుజనులు అందరి పైనా ఉందని తెలిపారు. దేశంలో ప్రతి పౌరునికీ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమాన అవకాశాలు అందేలా ప్రభుత్వాలు నడవాలని ఆయన సూచించారు. అనంతరం డాక్టర్ రతన్‌లాల్‌ను బి.పి. మండల్‌సేన అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు దుశ్శాలువతో సత్కరించారు.

నిమజ్జన ఊరేగింపుపై
కూటమి నాయకుల దాడి

- భయభ్రాంతులకు గురైన భక్తులు
- వినాయకుడి విగ్రహం వదలి పారిపోయిన వైనం
- చుండూరు మండలం కేవీఎన్ పల్లిలో ఘటన

చుండూరు(వేమూరు): చుండూరు మండలం కేవీఎన్ పల్లి గ్రామంలో వినాయకుడి విగ్రహం నిమజ్జనం చేసేందుకు వెళుతుండగా కూటమి నాయకులు దాడికి పాల్పడ్డారు. భయభ్రాంతులకు గురైన భక్తులు విగ్రహాన్ని అక్కడే వదిలి పరారయ్యారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు వైఎస్సార్ సీపీ అభిమానులు వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు వెళుతున్నారు. ఆ సమయంలో పాటలు పెట్టగా సీఐ శ్రీనివాసరావు వెళ్లి పాటలు పెట్టవద్దని నిర్వాహకులకు హెచ్చరించారు. ఆ తర్వాత ఊరేగింపుతో కొత్తపల్లి వెళుతున్నారు. కొత్తపల్లి వద్ద కూటమి నాయకులు గుమ్మడి హర్షవర్ధన్, గోవింద్, గణేష్, దుర్గా, రాజేష్, గోపి మారణాయుధాలతో ఊరేగింపుపై దాడి చేశారు. వినాయకుడి విగ్రహం తీసుకొని వెళుతున్న రెండు ట్రాక్టర్లలోని మహిళలను ఇష్టారాజ్యంగా కొట్టారు. భయభ్రాంతులకు గురైన నిర్వాహకులు వినాయకుడి విగ్రహం నిమజ్జనం చేయకుండా వదలి పరారయ్యారు. చుండూరు సీఐ శ్రీనివాసరావు కూటమి నాయకులు, కార్యకర్తలను దాడికి ప్రోత్సహించారని బాధితులు చెబుతున్నారు. మహిళలపై దాడి చేసి వారి మెడలో బంగారు గొలుసులు కూడా తీసుకెళ్లినట్లు బాధితులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన తర్వాత ఇష్టారాజ్యంగా దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. వినాయకుడు విగ్రహం కూడా ఊరేగింపు చేసుకోకుండా అడ్డుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. వినాయకుడు విగ్రహం ఊరేగింపును అడ్డుకుని మహిళలు, పురుషులపై దాడులు చేసిన కూటమి నాయకులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు. దాడులకు పాల్పడిన వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని కోరారు.

సౌత్ ఇండియా జోనల్ కరాటే పోటీల్లో సత్తెనపల్లి విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో కరాటే మాస్టర్ అనుముల రామయ్య

సత్తెనపల్లి: సౌత్ ఇండియా జోనల్ కరాటే పోటీల్లో పల్నాడు జిల్లా సత్తెనపల్లి విద్యార్థులు ప్రతిభ చూపారు. బెంగళూరులోని కోరమంగళ ఇండోర్ స్టేడియంలో ఈనెల 30,31న జరిగిన సౌత్ ఇండియా జోనల్ కరాటే పోటీల్లో సత్తెనపల్లికి చెందిన షికోకాయ్ షిటోరియో కరాటే ఇనిస్టిట్యూట్ విద్యార్థినీ విద్యార్థులు ప్రతిభ చూపి ఐదు గోల్డ్ మెడల్, ఒక బ్రాంజ్ మెడల్‌ను కైవసం చేసుకుని సత్తెనపల్లి పట్టణానికి గుర్తింపు తీసుకొచ్చినట్లు కరాటే మాస్టర్ అనుముల రామయ్య ఆదివారం తెలిపారు. బాలికల కటా విభాగంలో బి అక్షయ్‌రెడ్డి గోల్డ్ మెడల్, బాలుర కటా విభాగంలో బి.టిష్యంత్, ఎంవీ.బాలాజీ, ఎల్ కిరీట్, ఎల్ గౌష్టిఆషిత్‌లు గోల్డ్‌మెడల్స్ సాధించగా .. బి.సత్యనారాయణ బ్రాంజ్ మెడల్ సాధించాడు. ప్రతిభ చూపిన విద్యార్థులను అకాడమీ ఆర్గనైజర్ ఏ.వీరబ్రహ్మం, అడ్వైజర్ ఏ.రాంబాబులు ప్రత్యేకంగా అభినందించారు.

పులిచింతలకు 2,32,037 క్యూసెక్కులు విడుదల



టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి పరుగులు పెడుతున్న వరద నీరు

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద ఉన్న నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ 17 క్రస్ట్ గేట్ల ద్వారా 2,32,037 క్యూసెక్కులు పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్‌ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రమణ్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు రిజర్వాయర్ తొమ్మిది క్రస్ట్‌గేట్లు మూడు మీటర్లు, ఎనిమిది క్రస్ట్ గేట్లు 2.5 మీటర్లు ఎత్తు ఎత్తి 2,32,037 క్యూసెక్కుల వరదనీటిని దిగువనున్న పులిచింతల ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు నీటిమట్టం 75.50 మీటర్లకుగాను 74.58 మీటర్లకు చేరుకుందన్నారు. రిజర్వాయర్ గరిష్ట నీటి సామర్థ్యం 7.080 టీఎంసీలకుగాను ప్రస్తుతం 6.462 టీఎంసీలు నీరు నిల్వ ఉందన్నారు. టీఆర్‌సీ లెవల్ 60.54 మీటర్లకు చేరుకుందన్నారు. ఎగువనున్న నాగార్జునసాగర్ నుంచి 2,89,876 క్యూసెక్కుల వరదనీరు ఇక్కడ ప్రాజెక్టుకు చేరుకుంటుందన్నారు. ప్రస్తుతం విద్యుత్ ప్రాజెక్టులోని రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసినట్లు వెల్లడించారు. నాగార్జునసాగర్ నుంచి వచ్చే వరదను బట్టి దిగువనున్న పులిచింతలకు నీటిని విడుదల చేస్తామని తెలిపారు.

కుమ్మరి శాలివాహన సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న శాలివాహన సంఘీయులు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో కుమ్మరి శాలివాహన సంఘీయుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్టు రాష్ట్ర కుమ్మరి శాలివాహన సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ తెలిపారు. పాలపాడురోడ్డులోని కల్యాణ మండపంలో ఆదివారం పల్నాడు జిల్లా కుమ్మరి శాలివాహన సంఘం కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. సంఘం నూతన అధ్యక్షునిగా తొర్లకొండ చినఅంజయ్య, కార్యదర్శిగా వీరబ్రహ్మంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా యూత్ అధ్యక్షునిగా బాడిశ మస్తాన్‌రావు (పిడుగురాళ్ల) నియమితులయ్యారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఐలాపురం భాస్కర శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజవరపు ఏడుకొండలు, సంఘం నాయకులు టి.మంగమ్మ, రంగయ్య, బి.రోశయ్య, సిహెచ్.వెంకటఅప్పారావు తదితరులు పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడు చిన అంజయ్య మాట్లాడుతూ త్వరలో జిల్లాలో నియోజకవర్గాల వారీగా పర్యటించి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

దుర్గమ్మకు పలువురు విరాళాలు



విరాళాలు అందజేస్తున్న దాతలు



ఉచిత ప్రసాద వితరణకు ..

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు ఆదివారం పలువురు భక్తులు విరాళాలు సమర్పించారు. గుంటూరు జిల్లా కొత్తూరుకు చెందిన మండవ శ్రీనివాసరావు, ఆదిలక్ష్మి దంపతులు నిత్యాన్నదానానికి రూ. 1,00,001 విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. గుంటూరుకు చెందిన తేగెల రవీంద్రబాబు, డాక్టర్ నాగేశ్వరమ్మలు తమ కుమార్తె మమత శ్రీరంగ పేరిట రూ.1,00,001 విరాళంగా ఇచ్చారు. అనంతరం దాతలకు అధికారులు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.

పారదర్శకత కోల్పోతున్న ఎన్నికల కమిషన్



మాట్లాడుతున్న దివాకర్ బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: భారత ఎన్నికల సంఘం గత దశాబ్ద కాలంగా స్వయం ప్రతిపత్తిని కోల్పోవడంతో పాటు పారదర్శకంగా, జవాబు దారీతనంతో వ్యవహరించడం లేదని సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. దివాకర్ బాబు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని బాలానంద కేంద్రంలో ఆదివారం రాజ్యాంగ చర్చా వేదిక అధ్యక్షుడు నడింపల్లి గురుదత్ అధ్యక్షతన "రాజ్యాంగం – భారత ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తి" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య వక్త దివాకర్‌బాబు మాట్లాడుతూ రాజ్యాంగంపై నమ్మ కం, విశ్వాసం లేని వాళ్లు పాలకులుగా కొనసాగు తూ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని తెలిపారు. భారత ఎన్నికల కమిషన్ సభ్యుల ఎంపిక ప్రక్రియ త్రిసభ్య కమిటీలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, ఆ స్థానంలో కేంద్ర మంత్రిని పెట్టడం సబబు కాదని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రను కోల్పోయే విధంగా కేంద్ర ప్రభు త్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. బిహార్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ హడావుడిగా ప్రత్యేక సమగ్ర సవరణ ద్వారా 65 లక్షల ఓట్లను తొలగించడం, ఆధార్ కార్డును పరిగణన లోకి తీసుకోకుండా జనన ధ్రువీకరణ పత్రాలను కోరడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. అత్యధికులు బిహార్ నుంచి వలస కార్మికులుగా పలు రాష్ట్రాలకు పోతున్న స్థితిని ఎన్నికల కమిషన్ పరిగణలోకి తీసుకోకపోవడం విచారకరమని తెలిపారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్‌కు దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో సొంత సిబ్బంది ఉండాలని అభిప్రాయపడ్డారు. ఓటర్ల జాబితా సక్రమంగా ఉంటే ప్రజా స్వామ్యం వికసిస్తుందని, దాని రూపకల్పనలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజ్యాంగ చర్చా వేదిక అధ్యక్షుడు నడింపల్లి గురుదత్ మాట్లాడుతూ రాజ్యాంగ మౌలిక స్వరూపానికి భంగం కలగకుండా దాన్ని కాపాడుకోవాలని కోరారు. రాజ్యాంగ చర్చా వేదిక కార్యదర్శి అవధానుల హరి మాట్లాడుతూ కాగ్, యూపీఎస్సీ, ఎన్నికల కమిషన్ వంటి రాజ్యాంగబద్ధ సంస్థల్లో అధికార పార్టీల జోక్యం ఉండరాదని తెలిపారు. రాజ్యాంగ చర్చా వేదిక సంయుక్త కార్యదర్శి డాక్టర్ టి. సేవా కుమార్, ప్రోగ్రెసివ్ ఫోరమ్ అధ్యక్షుడు పి. మల్లికార్జునరావు, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సీపీఎం నేత నళినీ కాంత్, సామాజిక విశ్లేషకులు టి. ధనుంజయ రెడ్డి ప్రసంగించారు.